సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

91829 05602

నంబర్‌లో సంప్రదించండి

క్లుప్తంగా

ఘనంగా పితృదినోత్సవం



నిమ్మగడ్డ బుచ్చయ్యను సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

మురళీనగర్: మురళీనగర్ పరిసర ప్రాంతాల్లో ఆదివారం పితృదినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మురళీనగర్, మాధవధార ప్రాంతాల్లోని సీనియర్ సిటిజన్స్, సేవా కార్యకర్తలను సత్కరించారు. వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు నిమ్మగడ్డ బుచ్చయ్య(90), వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు సెక్రటరీ జనరల్ రాళ్లపల్లి సత్యనాథం, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు కేఎల్‌వీ ప్రసాదరావులను సత్కరించి పితృదినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు ఎం.శేషామణి, కార్యదర్శి ససపల పుష్పలత, పూర్వ అధ్యక్షులు కె.మాధవి, డి.శిరీష, గీతాభాను పాల్గొన్నారు.

వడదెబ్బకు వ్యక్తి మృతి?

మర్రిపాలెం: మద్యానికి బానిసై, ఇంటికి దూరంగా ఉంటున్న ఒక వ్యక్తి మరణించిన సంఘటన ఇది. ఐదో పట్టణ పోలీసులు ఆదివారం తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం ధర్మానగర్‌లో పిల్లా రజనీకుమార్(50), భార్య రమాదేవి, ఇద్దరు కుమారులతో కలిసి నివసిస్తున్నాడు. ఇతడు మద్యానికి బానిసై భార్యతో మనస్పర్థల కారణంగా ఐదు నెలలుగా ఇంటికి వెళ్లకుండా రోడ్డుపైనే ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో ఊర్వశి జంక్షన్ వద్ద కూర్చుని ఉన్న రజనీకుమార్ ఒక్కసారిగా కుప్పకూలి మృతిచెందాడు. ఎండలకు వడదెబ్బ తగలడం వల్లే మరణించి ఉంటాడని భావిస్తున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.విజయకుమార్ పర్యవేక్షణలో ఏఎస్‌ఐ రాజారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

150 మందికి దంత వైద్య పరీక్షలు



దంత పరీక్షలు చేస్తున్న వైద్య బృందం

మురళీనగర్: బర్మాక్యాంప్‌లోని అల్లూరి సీతారామరాజు సంక్షేమ సంఘం వద్ద ఆదివారం నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అనిల్స్ కాలేజీ విద్యార్థుల సహకారంతో నిర్వహించిన ఈ శిబిరాన్ని వాకర్స్ డిస్ట్రిక్ట్–101 గవర్నర్ ఉప్పలపాటి శుభ ప్రారంభించారు. 150 మందికి దంత సమస్యలకు సంబంధించి వైద్య పరీక్షలు చేసి పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో వనితా వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు వి.ప్రభాశర్మ, డెంటల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ వంశీకృష్ణ, ఏడుగురు హౌస్ సర్జన్స్ పాల్గొన్నారు.

సంప్రదాయ కళలను ఆదరించాలి



కళాకారులకు బహుమతులు అందజేస్తున్న బాలకొండలరావు

దాబాగార్డెన్స్: సంప్రదాయ కళలకు ప్రాధాన్యమివ్వాలని నృత్య కళాకారిణి ఏబీ బాలకొండలరావు అన్నారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నాట్య పరిమళ మ్యూజికల్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో సంగీతం, నృత్యంపై ఆదివారం నిర్వహించిన నైపుణ్య శిక్షణలో విజేతలుగా నిలిచిన వారికి ఆమె బహుమతులు అందజేశారు. సభాధ్యక్షుడు ఎంవీ రాజశేఖర్ మాట్లాడుతూ భారతీయ సనాతన సంప్రదాయంలో భాగమైన కళలను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వంకాయల సన్యాసిరాజు సంస్థ ద్వారా కళా రంగానికి సేవలందిస్తున్న లిపికారెడ్డి, డాక్టర్ వై. బాలగణేష్‌ను అభినందించారు. కార్యక్రమంలో చెన్నా తిరుమలరావు, పి.శశిలత కృష్ణ, సత్యనారాయణరెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ నార్త్
9912440606

సమాచారమ్



జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయం

ప్రజా సేవలో జోన్-5 అధికారులు

కంచరపాలెం: జీవీఎంసీ జోన్-5 పరిధిలోని వార్డుల ప్రజలు తమ సమస్యలపై అధికారులకు ఫోన్ చేసి తెలియజేయవచ్చు. ఉత్తర, పశ్చిమ నియోజకవర్గాలకు సంబంధించి జోన్ పరిధిలో 40 నుంచి 63 వార్డులు ఉన్నాయి. జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలపై నేరుగా అర్జీలు అందజేయవచ్చు. ఏదైనా ఫిర్యాదు, సమస్య పరిష్కారం కోసం అధికారులను వారి ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చు.



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ

జీవీఎంసీ జోన్-5 అధికారులు, వారి ఫోన్ నంబర్లు

అధికారి పేరు	హోదా-విభాగం	ఫోన్ నంబర్
ఆర్.జి.వి.కృష్ణ	జోనల్ కమిషనర్(జెడ్సీ)	97050 86888
కె.పైడిరాజు	రెవెన్యూ కమిషనర్(ఏసీ)	83747 83932
ఎ.శ్రీనివాస్	ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ)	99128 72224
డాక్టర్ ఎ.సునీల్‌కుమార్	ఏఎంహెచ్‌వో(పబ్లిక్ హెల్త్)	98485 02578
ఎస్.జనార్దన రావు	శానిటరీ సూపర్‌వైజర్	70363 96919
సుధాకర్	మలేరియా ఇన్‌స్పెక్టర్	94941 83244
శైలజ	ఏపీడీవో(యూసీడీ)	77299 95963
మోహన్ గణేష్	ఏఈ(తాగునీటి విభాగం)	81878 99195
ఎస్.వి.అప్పారావు	ఏఈ(యూజీడీ)	80085 84176

వార్డుల వారీగా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, హెల్త్ అసిసెంట్ల ఫోన్ నంబర్లు

41	డి.వి.వి.ఎస్.ఎస్.ఎం.ప్రసాద్	శానిటరీ ఇన్‌స్పెక్టర్	99488 83942
42	ఎం.సన్యాసిదొర	హెల్త్ అసిస్టెంట్	77299 95924
43	అప్పారావు	బైట్ సోర్సింగ్ ఇన్‌చార్జి	99665 91821
44	ఎన్.సూరిబాబు	శానిటరీ ఇన్‌స్పెక్టర్	99488 83938
45	కె.పాండురంగ	హెల్త్ అసిస్టెంట్	99488 83932
46	వి.సత్యం	శానిటరీ ఇన్‌స్పెక్టర్	8008 536403
47	కె.వి.రమణమూర్తి	శానిటరీ ఇన్‌స్పెక్టర్	99488 83970
48.	డి.అప్పలరాజు	శానిటరీ ఇన్‌స్పెక్టర్	90103 93037
49	ఎం.రామకృష్ణ	శానిటరీ ఇన్‌స్పెక్టర్	99488 83937
50	ఎం.సుధాకర్	హెల్త్ అసిస్టెంట్	94941 83244
51	ఎం.సుధాకర్	హెల్త్ అసిస్టెంట్ ఇన్‌చార్జి	94941 83244
54	వై.త్రిమూర్తులు	పీహెచ్ మేస్త్రీ	99488 83947
55	ఉప్పిలి కార్తీక్	హెల్త్ అసిస్టెంట్	91105 97632

సాంస్కృతిక విభాగం అధ్యక్షురాలిగా మానేపల్లి లక్ష్మి



మానేపల్లి లక్ష్మిని సన్మానిస్తున్న ట్రస్టు మహిళా విభాగం ప్రతినిధులు

సీతంపేట: మదర్ ఇండియా వెల్ఫేర్ ట్రస్టు సాంస్కృతిక విభాగం అధ్యక్షురాలిగా మానేపల్లి లక్ష్మి ఎన్నికయ్యారు. అధ్యక్షురాలి స్థానం కోసం ముగ్గురు నామినేషన్ వేయగా.. ఏకాభిప్రాయ సాధనకు మిగిలిన ఇద్దరు ఉపసంహరించుకోవడంతో ఆమె ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మూడేళ్ల పాటు లక్ష్మి ఈ పదవిలో కొనసాగుతారు. అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలోని ట్రస్టు కార్యాలయంలో ఆదివారం జరిగిన ఎన్నికల ప్రక్రియను బి.సత్యమాధవి, మళ్ల లక్ష్మి, రేణుక, ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు మళ్ల వెంకటరావు, గౌరవాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు. సాంస్కృతిక విభాగం గౌరవాధ్యక్షురాలు మళ్ల లక్ష్మి, ఉపాధ్యక్షురాలు పి.రేణుక, ట్రస్టు కోశాధికారి ఇందిరా ప్రియదర్శిని తదితరులు కొత్తగా ఎన్నికైన మానేపల్లి లక్ష్మిని సన్మానించారు. అనంతరం ఆషాఢ మాసం సందర్భంగా మెహందీ పోటీలు నిర్వహించి విజేతకు బహుమతులు అందజేశారు. ఫాదర్స్ డే సందర్భంగా మళ్ల వెంకటరావు, బండి వెంకటేశ్వరరావులను మహిళలందరూ సత్కరించారు. ఈ సందర్భంగా మహిళలు ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

మంచిగా నడుచుకోండి

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ ధర్మేంద్ర మాట్లాడుతూ ఎటువంటి నేరాల జోలికి పోకుండా మంచిగా నడుచుకోవాలని వారికి సూచించారు. మద్యం షాపుల వద్ద గొడవలు చేయడం, తగాదాల్లో తలదూర్చడం వంటివి చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంతంగా జీవించాలని హితవు పలికారు. అనంతరం రౌడీ షీటర్లను వారి ఇంటి వద్ద పోలీస్ సిబ్బంది అప్పగించారు.



ద్వారకా పీఎస్‌లో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ ధర్మేంద్ర

ఫోర్త్ టౌన్ పీఎస్‌లో..

ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీ షీటర్లకు ఎస్‌ఐలు గౌరి, మోహన్‌రావు కౌన్సెలింగ్ నిర్వహించారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు.

సుందరంగా 46వ వార్డు

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డును సుందరంగా తీర్చేదిద్దే లక్ష్యంతో అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ తెలిపారు. సంజీవయ్య కాలనీ, శాంతినగర్, లక్ష్మీనారాయణ నగర్ కొండవాలు ప్రాంతాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. అక్కడ జరుగుతున్న సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, డ్రైనేజీలు, గెడ్డలు, కాలువలు, కల్వర్టుల నిర్మాణ పనులను పరిశీలించారు. నాణ్యతలో ఎక్కడా రాజీ పడకుండా పనులు చేపట్టాలని కాంట్రాక్టర్లకు సూచించారు. త్వరితగతిన వార్డులో అభివృద్ధి పనులను పూర్తి చేయాలని అధికారులకు కటుమూరి సతీష్ ఆదేశించారు. పర్యటనలో జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు భరణికుమార్, అర్చన, వర్క్ ఇన్‌స్పెక్టర్ జాగరపు నరేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.అప్పారావు, బి.గోవిందు, కృష్ణ, శ్రీను, అప్పలరెడ్డి, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.



శాంతినగర్‌లో కాలువ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్

ఉత్సాహంగా లాంగ్ టెన్నిస్ పోటీలు

సీతమ్మధార: సీతమ్మధార హిల్ వ్యూ పార్కులో ఆదివారం వైఎస్సార్ ట్రోఫీ లాంగ్ టెన్నిస్ పోటీలు నిర్వహించారు. చీఫ్ కోచ్ రామకృష్ణంరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో ఏడేళ్ల నుంచి 12 ఏళ్ల వయసు గల 58 మంది చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఏపీ టిడ్కో హౌసింగ్ చైర్మన్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో యువతను అన్ని రంగాలతోపాటు క్రీడా రంగంలో ప్రోత్సహించేలా అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. క్రీడల్లో ప్రతిభ చూపిన యువతకు తగిన ప్రోత్సాహం ఇవ్వడంతోపాటు వారి నైపుణ్యాన్ని మెరుగుపరుచు కునేందుకు అవసరమైన అన్ని సదుపాయాలను కల్పిస్తోందని చెప్పారు. ఒక ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి తద్వారా యువతి, యువకుల్లో నూతనోత్సాహాన్ని కల్పిస్తూ క్రీడారంగం రాష్ట్రంలో మరింత పటిష్టంగా ఉండేలా అవసరమైన అన్ని చర్యలు ప్రభుత్వం తీసుకుంటోందన్నారు. పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు ప్రసన్నకుమార్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఏపీ టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్

నేడు డయల్ యువర్ ఆర్డీవో

మహారాణిపేట: విశాఖ రెవెన్యూ డివిజనల్ అధికారి డి.హుస్సేన్ సాహెబ్ సోమవారం డయల్ యువర్ ఆర్డీవో కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుంది. గాజువాక, పెదగంట్యాడ, పెందుర్తి, మహారాణిపేట, ములగాడ, గోపాలపట్నం తదితర ప్రాంతాల తహసీల్దార్ల కార్యాలయాల పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం నిమిత్తం ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రజలు 0891-2562977 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యను తెలియజేయాలి.

కె.కె.రాజును కలిసిన పైడి రమణ

తాటిచెట్లపాలెం: ఇటీవల ఏపీ ఎడ్యుకేషన్, వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలకు స్వీకరించిన వైఎస్సార్‌సీపీ 45వ వార్డు అధ్యక్షుడు పైడి రమణ ఆదివారం నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు ఈ పదవి రావడంలో సహకరించిన కె.కె.రాజుకు ధన్యవాదాలు తెలియజేసి ఆయనను సత్కరించారు.

పైడి రమణకు అభినందనలు..

కార్పొరేషన్ డైరెక్టర్‌పైడి రమణను ఆదివారం ఆయన నివాసంలో వైఎస్సార్‌సీపీ వార్డు ముఖ్య నాయకులు, యువజన విభాగం, మహిళా విభాగం ప్రతినిధులు కలిసి అభినందనలు తెలియజేశారు.



కె.కె.రాజును సత్కరిస్తున్న పైడి రమణ

శ్రావ్యంగా గాత్ర కచేరి



గాత్ర కచేరి చేస్తున్న తేజశ్వరీ, బమ్మిడిపాటి వీణాదరి

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అకాడమీ అధ్వర్యంలో ఆదివారం మద్దిలపాలెం కళాభారతిలో జరిగిన గాత్రకచేరి శ్రావ్యంగా సాగింది. వర్ధమాన గాత్ర కళాకారులు లంక తేజశ్వరీ, బమ్మిడిపాటి వీణాదరి తమ గాత్రంతో అలరించారు. కార్యక్రమంలో కళాభారతి అధ్యక్షుడు ఎంఎస్ఎన్ రాజు, లలిత, చంద్రశేఖర్, వీరఘంట చంద్రశేఖర్, ఎంఎస్ శ్రీనివాస్, అయ్యగారి భుజంగరావు, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

జనరేషన్ యువ చిన్నారులకు వితరణ

మురళీనగర్: మురళీనగర్‌కు చెందిన శ్రీ మణికంఠ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జనరేషన్ యువ ఆశ్రమాన్ని సభ్యులు సందర్శించి అక్కడ ఆశ్రయం పొందుతూ విద్యనభ్యసిస్తున్న 24 మంది పిల్లలకు స్కూల్ షూస్ అందించారు. ఇందుకు అవసరమైన రూ.5,950 నగదులో సంఘ సభ్యులు వి.నాగేశ్వరరావు రూ.5000, మిగతా నగదును జి.శ్రీనివాసరావు, మణికంఠ సేవ సంఘం కలిసి అందించారు. కార్యక్రమంలో సేవా సంఘం అధ్యక్షుడు ఎం.రవికిరణ్, కార్యదర్శి ఆర్.గణపతిరావు, కోశాధికారి జీవీ ఆనందరావు, భాస్కరరావు, ఏఎస్ రావు, జీవీ మధుసూదనరావు, ఎస్.హరికుమార్, పి.పాపారావు, ఎస్‌వీఎల్ఎన్ స్వామి, వి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.



ఆశ్రమ చిన్నారులతో శ్రీ మణికంఠ సేవా సంఘం సభ్యులు

అన్ని రంగాల్లో మహిళలదే కీలక పాత్ర

మురళీనగర్: అన్ని రంగాల్లోనూ మహిళలే కీలక పాత్ర వహిస్తున్నారని వుమెన్ క్రికెటర్ షబ్నమ్ తండ్రి మహ్మద్ షకీల్ అన్నారు. ఫాదర్స్ డే సందర్భంగా మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించారు. క్రికెట్ ఆడుతూ ఇంటికి వచ్చిన సమయంలో తన తండ్రి గుండెపోటుతో స్వర్గస్థులయ్యారని దీంతో క్రికెట్‌కు గుడ్‌బై చెప్పి ఉద్యోగంలో చేరానన్నారు. అయితే తన కుమార్తెలను క్రికెట్ ప్రాక్టీస్‌కు తీసుకెళ్లినప్పుడు వారిలో ప్రతిభను గమనించి ప్రోత్సహించానన్నారు. ఆడపిల్లలు క్రీడా రంగంలో కూడా రాణించగలరని తన కుమార్తెలు నిరూపించారని చెప్పారు. ఆడపిల్లలు తాము ఎంచుకున్న రంగంలో రాణించేందుకు తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. ఈ సందర్భంగా మహ్మద్ షకీల్‌ను వనితా వాకర్స్ క్లబ్ తరఫున వాకర్స్ డిస్ట్రిక్ట్–101 గవర్నర్ ఉప్పలపాటి శుభ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వి.ప్రభాశర్మ, రోజారాణి, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



మహ్మద్ షకీల్‌ను సత్కరిస్తున్న 101 గవర్నర్ శుభ, వనితా వాకర్స్ క్లబ్ సభ్యులు

సర్వ రోగ నివారిణి యోగా

అల్లిపురం: యోగా సర్వరోగ నివారిణిగా పని చేస్తుందని ప్రజాపిత బ్రహ్మ కుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ప్రతినిధి బీకే రాజేశ్వరి అన్నారు. ఆదివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆరు ముఖ్యమైన యోగాసనాలు, రెండు రకాల ప్రాణాయామాల గురించి వివరించారు. సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ అమెరికాలో జరిగే యోగా దినోత్సవంలో 180 దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటారని వివరించారు. యోగా ద్వారా ఆరోగ్య పరిరక్షణ సాధ్యపడుతుందన్నారు.

రథయాత్ర వీక్షణకు బాలలకు ప్రత్యేక ఏర్పాట్లు అవసరం

మహారాణిపేట: ఈ నెల 20 నుంచి పది రోజుల పాటు జరగనున్న జగన్నాథ రథయాత్రలో పిల్లలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం సూచించారు. టర్నర్ చౌల్ట్రీ వద్ద గల దేవదాయ శాఖ కార్యాలయ ఆవరణలో ఆదివారం దేవదాయ శాఖ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, 1098 చైల్డ్‌లైన్, జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. గతేడాది ఉత్సవాల్లో ఎంత మంది బాలలు రథోత్సవాన్ని తిలకించారని దేవాలయ ఈవో రాజగోపాలరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. వైద్య ఆరోగ్య శాఖ కూడా కిట్లు, పారా మెడికల్ సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. దివ్యాంగ బాలలకు ప్రత్యేక దర్శనం కల్పించేందుకు ట్రై సైకిళ్లతోపాటు ప్రత్యేక దర్శన లైన్లు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఈవో రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ కమిషన్ సూచనల ప్రకారం బాలలకు సేవలందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి రమేష్, చైల్డ్‌లైన్ 1098 జిల్లా కో–ఆర్డినేటర్ డేవిడ్ రాజు, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ అధికారి రమణకుమారి, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారామ్

పోలీస్ స్టేషన్‌లో సీసీ కెమెరాలు



సీసీ కెమెరాల దృశ్యాలను టీవీలో పర్యవేక్షిస్తున్న సీఐ శ్రీనివాసరావు

సీతమ్మధార: స్థానిక ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. స్టేషన్‌లోని ముగ్గురు ఎస్‌ఐల రూమ్‌లతోపాటు హెడ్ కానిస్టేబుల్, కంప్యూటర్ రూమ్, బయట, హాల్, ఇతర ప్రదేశాల్లో వాటిని అమర్చారు. సీఐ రూంలో టీవీ ఏర్పాటు చేసి సీసీ కెమెరాల రికార్డయ్యే దృశ్యాలను పరిశీలిస్తున్నారు. మొత్తం ఎనిమిది కెమెరాల ద్వారా ఉద్యోగుల విధులను పర్యవేక్షించనున్నారు. వీటి ద్వారా అవినీతిని అరికట్టడంతోపాటు సిబ్బంది పనితీరు తెలుస్తుంది. ఇటీవల కాలంలో పోలీస్ స్టేషన్ నుంచి గంజాయి నిందితులు బేడీలతో పరారీ కావడంతో సీపీ ఆదేశాల మేరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.



స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్‌కు విశేష స్పందన

బీచ్ రోడ్డు: విదేశాల్లో విద్యాభ్యాసంపై అవగాహన కోసం ఐవీ ఓవర్సీస్ సంస్థ ఏర్పాటు చేసిన గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్–2023కు విశేష స్పందన లభించింది. నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ఎడ్యుకేషన్ ఫెయిర్‌ను ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.కృష్ణమోహన్, జేఎన్‌టీయూ విజయనగరం రిజిస్ట్రార్ డాక్టర్ స్వామి నాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలని చాలా మందికి ఉన్నా.. ఎలా ప్రవేశం పొందాలి, ఏ విద్యా సంస్థలు మంచివి అనే అంశాలు తెలియక ఇబ్బంది పడుతున్నారన్నారు. అమెరికా, కెనడా, యూకే, ఆస్ట్రేలియా, ఐర్లాండ్‌కు చెందిన 33 ప్రముఖ యూనివర్సిటీలు ఈ ఎడ్యుకేషన్ ఫెయిర్‌కు హాజరై సుమారు 300 మంది విద్యార్థుల సందేహాలు నివృత్తి చేశాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఐవీ సంస్థ వ్యవస్థాపకులు బి.రామ్‌కుమార్, బి.శ్రీనివాసరావు, మార్కెట్ హెడ్ వెంకట రామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



ఎడ్యుకేషన్ ఫెయిర్‌లో సందేహాలు నివృత్తి చేసుకుంటున్న విద్యార్థులు

పబ్లిక్ డిమాండ్

వీధిలైట్లు వెలగక ఇబ్బందులు



బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో వెలగని వీధిలైట్లు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో వీధిలైట్లు సక్రమంగా వెలగడం లేదు. వారం రోజులుగా అభయాంజనేయ స్వామి ఆలయం రోడ్డులో లైట్లు వెలగకపోవడంతో రాత్రి పూట పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. జీవీఎంసీ విద్యుత్ శాఖ అధికారులు పరిశీలించి విద్యుత్ లైట్లకు మరమ్మతులు చేపట్టి వెలగించాలి.

– ఎస్.గుణ, బాలయ్యశాస్త్రి లేఅవుట్

చీకట్లోనే రాకపోకలు



అంధకారంలో వీటీ హైస్కూల్ రోడ్డు

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట మెయిన్ రోడ్ నుంచి రామాటాకీస్ రహదారికి వెళ్లే వీటీ స్కూల్ రోడ్‌లో వీధిలైట్లు వెలగక అంధకారం అలుముకుంటోంది. వాహన చోదకులు హెడ్‌లైట్ల వెలుగులో రాకపోకలు సాగిస్తున్నారు. చీకటి పడితే అంధకారంతో పాదచారులు, వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– జి.ఈశ్వరరావు, శ్రీనగర్



తహశీల్దార్ వారి కార్యాలయం
గోపాలపట్నం

రి.క.నెం.599/2023/A/ తేది.24.05.2023

పత్రికా ప్రకటన

గోపాలపట్నం మండలం, మాధవధార గ్రామ కాపురస్తులు శ్రీ రెడ్డి రమేష్ తండ్రి అర్జున్ నాయుడు, డోర్ నెం. 39-10-33/3, మాధవధార గ్రామం గోపాలపట్నం మండలం, విశాఖపట్నం వారు ఈ క్రింది పట్టికలో తెలిపిన స్థలమునకు "నిరభ్యంతర ధృవీకరణ పత్రము (NOC) మంజూరు చేయ్యవలసినదిగా కోరియున్నారు.

గ్రామం పేరు	సర్వే నెం.	విస్తీర్ణము
మాధవధార	42-2A2 Part	36.73 Sq.Yds

పైన తెలిసిన భూమికి "నిరభ్యంతర ధృవీకరణ పత్రము" మంజూరు చేయుటకు ఎవరికయినా ఎటువంటి అభ్యంతరములు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన 15 దినములలోగా శ్రీ జాయింటు కలెక్టరు మరియు కాంపిటేంట్ అథారిటీ, అర్బన్ ల్యాండ్ సీలింగ్, కలెక్టరు కార్యాలయము, విశాఖపట్నం వారికి మరియు శ్రీ తహశీల్దార్, గోపాలపట్నం వారికి లిఖిత పూర్వకముగా తెలియజేయవలసినదిగా కోరడమైనది.

తహశీల్దార్
గోపాలపట్నం మండలం, విశాఖపట్నం